ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డులు: దివ్యదేవరాజన్

వికారాబాద్ కలెక్టరేట్, పరిగి, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డులను అందించాలని సెర్ప్ సీఈవో, జిల్లా ప్రత్యేక అధికారిణి దివ్యదేవరాజన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వికారాబాద్ పురపాలక పరిధి కొంపల్లిలో డిజిటల్ కుటుంబ సర్వే కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ సుధీర్, శిక్షణ కలెక్టర్ ఉమాహారతితో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాచారం కోసం వచ్చే అధికారులకు సహకరించాలని ప్రజలను కోరారు. ఇప్పటి వరకు ఉమ్మడి కుటుంబంలో ఉన్నవారు, విడిగా ఉండాలనుకునే వారు మరో డిజిటల్ కార్డు పొందేందుకు సమాచారాన్ని సర్వే అధికారులకు చెప్పాలన్నారు. ఆమె వెంట డీఆర్‌డీవో శ్రీనివాస్, ఏడీఏ మహమూద్, పుర అధికారులు ఉన్నారు. పరిగి పట్టణంలోని 13వ వార్డులో జరుగుతున్న ఇంటింటి సర్వేను దివ్య దేవరాజన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ సభ్యుల వివరాల్లో తప్పులు లేకుండా చూడాలన్నారు.


వివరాలు పరిశీలిస్తున్న సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్, కలెక్టర్ ప్రతీక్‌జైన్

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ర్యాలీ

వికారాబాద్ కలెక్టరేట్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్-2024ను నిర్వహిస్తున్నారని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద టార్చ్ రిలే ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ర్యాలీ ద్వారా యువతకు క్రీడలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. జిల్లా యువజన క్రీడల అధికారి హన్మంత్ రావు, స్పోర్ట్స్ అథారిటీ ప్రతినిధులు మధుసూదన్, వెంకటేశ్వరావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

కళాశాల విద్యకు కష్టాలే

న్యూస్‌టుడే పరిగి, కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట

జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కొరత విద్యార్థులను, అధ్యాపకులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఏళ్లుగా పరిస్థితులు మెరుగుపడకపోవడంతో నిత్యం అవస్థలు పడాల్సి వస్తోంది.


కొడంగల్ కళాశాలలో విద్యార్థులు

ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట విద్యాభివృద్ధికి కృషి చేస్తోంది. అయితే ఉన్నత విద్యకు వచ్చే సరికి కనీస సౌకర్యాలు కొరవడుతున్నాయి. ప్రధానంగా అధ్యాపకులు లేకపోవడంతో ఉన్నవాటిని సమీపంలోని ఇతర కళాశాలల్లో విలీనం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. తాజాగా దౌల్తాబాద్ కళాశాలను కొడంగల్‌లో, బొంరాస్‌పేట కళాశాలను పరిగిలో విలీనం చేశారు. ఆయా కళాశాలల్లో చేరిన వారిలో కొందరు మాత్రమే ప్రవేశం పొందారు. మిగతా వారు మధ్యలోనే మానేశారు.

- బోధకులు లేక రెండు చోట్ల విలీనం
- జిల్లాలో మండలాలు: 20
- పంచాయతీలు: 566
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలు: 13
- విద్యార్థుల సంఖ్య: 3,250
- పరిగిలో కళాశాల ఏర్పాటు: 1980
- కొడంగల్‌లో ప్రారంభం: 1970

మంచినీరు లేక: బొంరాస్‌పేట నుంచి ఆరుగురు విద్యార్థులు పరిగిలో చేరారు. స్థానికంగా ఉన్న కళాశాలలో మొత్తంగా 350 మంది విద్యార్థులున్నారు. పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో దీనిని ఏర్పాటు చేశారు. తాగేందుకు మంచినీరు లేకపోగా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. ప్రహరీ లేకపోవడంతో పశువులు, పందులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. 11మంది అధ్యాపకులకు కేవలం ఏడుగురు పనిచేస్తున్నారు. మిగతావారిని అతిథి అధ్యాపకులుగా కొనసాగిస్తున్నారు. పురాతన భవనం కావడంతో వర్షాల సమయంలో ఉరుస్తున్నాయి.

కొడంగల్‌లో: కొడంగల్ కళాశాలలో 436 మంది విద్యార్థులు చదువుతున్నారు. సొంత భవనం ఉన్నా, శౌచాలయాల పైపులు విరిగిపోయి, విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. తొమ్మిది మంది రెగ్యులర్, ఆరుగురు ఒప్పంద అధ్యాపకులున్నారు. ఆంగ్లం, గ్రంథపాలకుడు, స్వీపర్, పీఈటీ అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ల్యాబ్ గదుల ముందు ఫ్లోరింగ్ మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది. దౌల్తాబాద్ కళాశాలలో 27 మంది విద్యార్థులు చేరారు. వీరిలో ఒక్కరే పాసయ్యారు. ఈ సారి ముగ్గురే హాజరవుతున్నారు. బొంరాస్‌పేటలో రెగ్యులర్ కోర్సులతో పాటు ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ కోర్సులు ప్రారంభించారు. ఈసారి కళాశాలలో మొత్తం 16 మంది చేరారు, అందులో ప్రస్తుతం ఆరుగురు మాత్రమే పరిగికి వెళ్తున్నారు.

విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా చర్యలు: శంకర్, నోడల్ అధికారి

విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా విలీనం చేయాల్సి వచ్చింది. అధ్యాపకుల పోస్టుల భర్తీ అయిన వెంటనే, తిరిగి ఆయా ప్రాంతాల్లో కళాశాలలను పునఃప్రారంభిస్తాం. మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారిస్తాం.

పైపైకి.. పాతాళ గంగ

న్యూస్‌టుడే, తాండూరు:

జిల్లాలో భారీగా వర్షాలు కురవడంతో భూగర్భ జలమట్టం పెరిగింది. బోర్లు, బావుల్లో జలం సమృద్ధిగా ఉండడంతో రైతులకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, ప్రధాన జలాశయాలు పూర్తిగా నిండడంతో సమీపంలోని వనరుల్లో నీటి మట్టాలు పెరిగాయి. ప్రధానమైన నదులతో పాటు గ్రామాలకు సమీపంలోని వాగులు వరదతో ప్రవహించాయి. ఫిజియో మీటర్ల ఆధారంగా నీటి మట్టాలను పరిశీలించి అధికారులు గణాంకాలను నమోదు చేశారు. 20 మండలాల్లో ఆగస్టుతో పోలిస్తే సెప్టెంబరులో భూగర్భ జలం 3.38 మీటర్లు పెరిగింది. ఆగస్టులో 10.62 మీటర్ల లోతులో ఉన్న జల మట్టం సెప్టెంబరులో 7.24 మీటర్ల పైకి వచ్చింది.

యాసంగికి అనుకూలం: జల మట్టం పెరగడంతో యాసంగి సాగుకు అనువుగా మారింది. జూన్, జులైలో వర్షాలు నామమాత్రంగా ఉండడంతో వానాకాలం పంటల సాగు ఇబ్బందిగా మారింది. ఆగస్టులో భారీ వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు, ప్రధాన జలాశయాలు నిండాయి. కాగ్నా, కాకరవేణి నదులతో పాటు గ్రామాల సమీపంలోని వాగులు ప్రవహించాయి. వాడిపోయే దశకు చేరిన పంటలకు జీవం పోశాయి.

- ప్రధాన జలాశయాలు: 10
- చెరువులు, కుంటలు: 1,179
- వ్యవసాయ బోరు, బావులు: 60,000
- ప్రధాన నదులు: కాగ్నా,కాకర వేణి


బుద్ధారంలో బోరు నుంచి ఉబికి వస్తున్న నీరు

వర్షపాతం నమోదు: జిల్లాలో 2023 వానాకాలంతో పోల్చి చూస్తే ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు వరకు నమోదైన వర్షపాతం ఎక్కువే. 2023లో జూన్ నుంచి సెప్టెంబరు వరకు 623.5 మి.మీ.సాధారణ వర్షానికి గాను 803.5 మి.మీ. వర్షం కురిసింది. 2024లో జూన్ నుంచి సెప్టెంబరు వరకు 623.6మి.మీ.కు గాను 877.7 మి.మీ. కురిసింది. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 40.7 శాతం ఎక్కువ.

జిల్లాలో భూగర్భ జలమట్టం (మీటర్లలో)

ప్రాంతం	ఆగస్టు	సెప్టెంబరు
తాండూరు	3.81	1.73
పెద్దేముల్	7.18	5.69
బిజ్వారం	11.27	8.6
బషీరాబాద్	11.04	7.32
యాలాల	12.97	7.6
కొడంగల్	9.62	3.15
దౌల్తాబాద్	8.65	4.45
దుర్గం చెరువు	3.69	3.05
మాదిరెడ్డిపల్లి	21.66	17.78
తొర్మామిడి	7.92	6.48
పరిగి	20.18	14.76
వికారాబాద్	12.44	7.5

నెల వారీగా జలమట్టం
- జూన్:14.89 ● జులై:12.07
- ఆగస్టు:10.62 ● సెప్టెంబరు:7.24

పొదుపుగా వినియోగించాలి: రవిశంకర్, జిల్లా భూగర్భజల అధికారి

అవసరం ఉన్న మేరకే నీటిని సాగుకు వినియోగించాలి. గ్రామాలు, పట్టణాల్లో తాగునీరు, ఇతర అవసరాలకు అవసరమున్న మేరకు వాడాలి. వృథా చేయొద్దు. నీటి నిల్వకు అనుకూలమైన ప్రదేశాల్లో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలి. ఇలా చేయడం వల్ల సమీప బోర్లు, బావుల్లో నీటి మట్టం తగ్గకుండా ఉంటుంది.

ఇబ్బందులు లేకుండా వంతెన నిర్మాణం


అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు టౌన్, కొడంగల్, న్యూస్‌టుడే: పాత తాండూరు వైపు వెళ్లే మార్గంలో ఎవరికీ ఇబ్బందులు లేకుండా వంతెన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. వంతెన నిర్మాణంపై శుక్రవారం ఆర్‌అండ్‌బీ, పురపాలక సంఘం అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. వంతెన ఎక్కడి నుంచి ఎక్కడి దాకా వెళ్తుంది? ఎవరెవరికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నది పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘం కమిషనరు విక్రమసింహారెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే: కుటుంబ డిజిటల్ కార్డులకు పకడ్బందీగా సర్వే చేయాలని సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 1వ వార్డు పరిధి మల్‌రెడ్డిపల్లి ప్రాంతంలో సర్వేను ఆయన పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. కొడంగల్ 8వ వార్డులోనూ పర్యటించి సర్వే తీరును తెలుసుకొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ బి.విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ పాల్గొన్నారు.

బహుజన బతుకమ్మకు హైకోర్టు అనుమతి

పూడూరు, న్యూస్‌టుడే: నేవీ ప్రాజెక్టు ఏర్పాటుకు వ్యతిరేకంగా దామగుండం ఐకాస ఆధ్వర్యంలో ఈ నెల 6న 'బహుజన బతకమ్మ ఆట పాట'కు హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ విషయాన్ని అటవీ పరిరక్షణ కమిటీ సభ్యులు సత్యానందస్వామి తెలిపారు. పోలీసులు అనుమతులు నిరాకరించడంతో కోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. కార్యక్రమాన్ని యథావిధిగా చేసుకోవచ్చని అందుకు పోలీసు బందోబస్తు కల్పించాలని శుక్రవారం న్యాయమూర్తి ఆదేశించినట్లు వెల్లడించారు. చేసే కార్యక్రమాలు పోలీసుశాఖ షరతులకు లోబడి చేసుకోవాలని కోర్టు స్పష్టం చేసిందని స్థానిక ఎస్సై మధుసూదన్ రెడ్డి 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

పారిన వరద.. రాకపోకలకు బెడద



ధారూర్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు పారడంతో, నాగసమందర్ వెళ్లే రోడ్డుపై వరద పారి రాకపోకలు నిలిచిపోయాయి. దోర్నాల్ వెళ్లే రహదారిలో అసంపూర్తి వంతెన వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డుపై వరద ఉద్ధృతికి మట్టి కొట్టుకుపోయింది. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. – న్యూస్‌టుడే, ధారూర్.

నాడు మోడు వారి.. నేడు పచ్చందాల సిరి





కోట్‌పల్లి మండలం అన్నాసాగర్ నుంచి పెద్దేముల్ మండలం మారేపల్లి వరకు గతంలో హరితహారంలో మొక్కలు నాటారు. అవి నేడు వృక్షాలుగా మారాయి. అయితే గత వేసవిలో ఎండలకు మోడు వారాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మళ్లీ జీవం పోసుకుని పచ్చగా చిగురిస్తున్నాయి. ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పెంచుతున్నాయి. – న్యూస్‌టుడే, పెద్దేముల్.


తాండూరులో బతుకమ్మను పేరుస్తున్న యువతులు


పాటలు పాడుతూ ఆడుతున్న మహిళలు

పూల తేరు.. పాటల హోరు



తాండూరు పట్టణంలోని కాలనీలు, వికారాబాద్ పట్టణంలోని జూనియర్, డిగ్రీ కళాశాలల్లో శుక్రవారం బతుకమ్మ సంబురాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు, యువతులు రంగురంగుల వస్త్రాలు ధరించి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలతో హోరెత్తించారు.

– న్యూస్‌టుడే, తాండూరుటౌన్, వికారాబాద్ మున్సిపాలిటీ.



తాండూరు మండలం అంతారం తండా భూకైలాష్, సిరిగిరిపేటలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రెండోరోజు అమ్మవారిని గాయత్రీదేవీగా అలంకరించారు. గౌతాపూర్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారికి యువకులు పూజలు నిర్వహించారు.

–న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు: ఎస్పీ


మాట్లాడుతున్న నారాయణరెడ్డి

కుల్కచర్ల, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ నారాయణరెడ్డి హెచ్చరించారు. కుల్కచర్ల ఠాణాను శుక్రవారం ఆయన సందర్శించి, రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపడుతామన్నారు. దుకాణదారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కుల్కచర్ల ఠాణా పరిధిలో నేరాలు తక్కువగా ఉన్నాయని, ఇది మంచి పరిణామమన్నారు. చౌడాపూర్ మండల కేంద్రంలో కొత్త పోలీస్‌స్టేషన్ ఏర్పాటు ప్రభుత్వ పరిశీలనలో ఉందని చెప్పారు. ఆయన వెంట డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్ ఉన్నారు.

హత్యకు దారి తీసిన వివాహేతర సంబంధం


శ్రీకాంత్


వివరాలు వెల్లడిస్తున్న ధారూర్ సీఐ భీమ్‌కుమార్

25న మృతదేహాన్ని జలపాతంలో పారేసిన నిందితులు

ధారూర్, న్యూస్‌టుడే: వివాహేతర సంబంధం యువకుడి హత్యకు దారి తీసింది. ఈ సమాచారం బయటికి పొక్కడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరాన్ని అంగీకరించడంతో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం ధారూర్ సీఐ భీమ్‌కుమార్ తెలిపిన ప్రకారం కోట్‌పల్లి మండలం అన్నసాగర్‌కు చెందిన ఇలిటెపు శ్రీకాంత్(28) సెప్టెంబరు 25న కోట్‌పల్లికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. తండ్రి నర్సింహులు ఫిర్యాదుతో కోట్‌పల్లి పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు.

ఏం జరిగిందంటే..: అన్నసాగర్‌కు చెందిన ఓ మహిళతో శ్రీకాంత్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఆమెతోనే చౌట మల్లేశం కూడా సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం శ్రీకాంత్‌కు తెలిసిపోవడంతో సదరు మహిళ, మల్లేశాన్ని హత్య చేస్తానని బెదిరించాడు. దీంతో వారు భయపడి శ్రీకాంత్‌నే అంతమొందించాలని పథకం వేశారు. ఇందుకోసం మొల్ల బందెల్లి, బంటు బందెల్లి, అంజప్ప సహకారం తీసుకున్నారు. పన్నాగంలో భాగంగా గత నెల 25వ తేదీన కోట్‌పల్లి మండలం లింగంపల్లి చౌరస్తాకు శ్రీకాంత్‌ను రమ్మని కబురు పెట్టారు. అక్కడికి రాగానే మద్యం తాగించి కారులో కర్ణాటక సరిహద్దు మల్కాపురం జడి జలపాతం తీసుకెళ్లారు. అక్కడ తాడుతో గొంతుకు బిగించి హత్య చేసి, మృతదేహాన్ని అందులో పారేసి, గ్రామానికి వచ్చి, ఇక శ్రీకాంత్ కనిపించడంటూ మాట్లాడటం మొదలెట్టారు. దీంతో వారిపై గ్రామస్థులకు అనుమానం వచ్చింది. ఇదే అంశాన్ని బందయ్య వద్ద ప్రస్తావించగా, పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై స్రవంతి వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, నేరాన్ని అంగీకరించడంతో అరెస్టు చేశారు. మృతదేహం కోసం జలపాతంలో గాలించినా లభించలేదు.

కొరవడిన నిఘా.. కల్తీతో దగా!

న్యూస్‌టుడే, పరిగి, వికారాబాద్ కలెక్టరేట్

- కుల్కచర్ల మండల కేంద్రంలో ఇటీవల పోలీసులు 60 కిలోల కల్తీ టీపొడిని స్వాధీనం చేసుకున్నారు. ఇది జరిగిన వారం వ్యవధిలోనే కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్టును పట్టుకున్నారు. ఆరా తీయగా హైదరాబాద్ నుంచి తీసుకువస్తున్నట్లు చెప్పడంతో సదరు వ్యాపారి వద్ద కూడా నగరంలో దాడులు నిర్వహించి రెండు క్వింటాళ్ల టీ పొడిని, వెల్లుల్లి, పేస్టును స్వాధీనం చేసుకున్నారు.

జిల్లాలో కల్తీ వ్యాపారం చాపకింద నీరులా విస్తరిస్తోంది. పట్టుబడిన సమయంలోనే ఈ ఘటనలు వెలుగు చూస్తున్నాయి. పేదల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు స్వార్థపరులు నిత్యావసర సరకులను కల్తీ చేసి విక్రయిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఈ దందా నిరాటంకంగా సాగిపోతోంది. అడిగేవారు లేరని, గ్రామీణ ప్రాంతాల్లో విక్రయిస్తూ, పేదల జీవితాలతో ఆటలాడుతున్నారు.

సంతల్లో విక్రయిస్తూ..: పరిసర గ్రామాల నుంచి కొనుగోలు చేసేందుకు వస్తున్న వారిని గుర్తించి నాణ్యమైన సరకుల పేరుతో అంటగడుతున్నారు. కారంపొడి, పసుపు, నూనెతో పాటు వెల్లులి పేస్టు, జీలకర్ర, ఆవాలు, టీపొడర్ ఇలా అన్నీ చౌకగా ఇస్తామని చెబుతూ ఆకర్షణీయ ప్యాకెట్లను తయారు చేసి వారిని ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వికారాబాద్, తాండూరు, పరిగి పట్టణ ప్రాంతాలు ప్రజల రాకపోకలతో నిత్యం రద్దీగానే ఉంటాయి. పరిగిలో శుక్ర, శనివారాలు, దోమ, పూడూరు మండలం మన్నెగూడలో మంగళవారం, కుల్కచర్లలో బుధవారం సంతలు జరుగుతున్నాయి. ఇలా రోజుకోచోట విక్రయాలు కొనసాగిస్తూ అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు.

హైదరాబాద్ కేంద్రంగా..: ఈ దందా హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అక్కడ తయారు చేస్తున్న కల్తీ సరకులను తీసుకువచ్చి రద్దీ ప్రాంతాలతో పాటు, పల్లెల్లో ఎవరికీ అనుమానం కలగని రీతిలో విక్రయిస్తున్నారు. పాలల్లోనూ యూరియా కలుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పెట్రోల్‌లోనూ డీజిల్‌ను కలిపి అమ్ముతున్నారని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. పర్యవేక్షణ అధికారుల నంబర్లను ప్రదర్శించాలని, దీంతో ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.



కుల్కచర్లలో స్వాధీనం చేసుకున్న కల్తీ టీపొడి పెట్టెలు

ప్రత్యేక నిఘా ఉంచాం: శ్రీనివాస్, సీఐ



నిత్యావసర సరకులను కల్తీ చేయడం నేరం. గ్రామాల్లో ఇలాంటివి జరిగితే సమీప పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేయాలి. తక్కువ ధరలకు లభిస్తున్నాయని ప్రచారం చేసుకునే వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.


హనుమంత వాహనంపై పద్మనాభుడు

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలంపల్లి అనంతపద్మనాభ స్వామిని హనుమంత వాహనంపై పురువీధుల్లో ఊరేగించారు. గోవింద నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. – న్యూస్‌టుడే, వికారాబాద్ గ్రామీణ, టౌన్.

నేతలు హుందాగా వ్యవహరించాలి: ఎంపీ


భవాని ఆలయంలో పూజలు చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బషీరాబాద్ న్యూస్‌టుడే: నాయకులు ఇష్టానుసారం మాట్లాడం తగదని, పదవిలో ఉన్నప్పుడు హుందాగా వ్యవహరించాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కాశీంపూర్, బషీరాబాద్, దామర్‌చెడ్ గ్రామంలో పర్యటించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైడ్రా పేరుతో ప్రభుత్వం ప్రజల దృష్టి మళ్లిస్తోందని, ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అనంతరం భవాని మాత ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ కుమార్, బషీరాబాద్ మండల భాజపా నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానాధికారి సత్తార్

పూడూరు, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానాధికారి ఎం.ఏ సత్తార్ చెప్పారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పూడూరు రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాటిన నాలుగేళ్ల నుంచి దిగుబడులు వస్తాయని దాదాపు 30ఏళ్ల వరకు నిరంతర ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, ఏడీఏ లక్ష్మీకుమారి, ఇకోఫాం సంస్థ కాన్సలెంట్ రంగనాయకులు ఉన్నారు.

అనంతగిరి.. చూసి తనివి తీరాల్సిందే!

సెలవుల్లో సందర్శించాల్సిన స్థలం



న్యూస్‌టుడే, వికారాబాద్

ఆ మార్గంలో వెళ్తే ప్రకృతి మనల్ని పలకరిస్తుంది.. ఎత్తయిన గుట్టలు.. మయూరాల విన్యాసాలు.. పచ్చని వనాలు.. జింకలు.. పక్షుల కిలకిలరావాలు.. అనంతపద్మనాభస్వామి ఆలయం.. ఇవన్నీ అనంతగిరి సొంతం. హైదరాబాద్‌కు 60 కి.మీ. దూరంలోని అనంతగిరికి వస్తే సహజసిద్ధ ప్రకృతి ఒడిలో సేదతీరవచ్చు. ఇక్కడి కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటు షికారు చేయొచ్చు. ఇక్కడికొస్తే రోజంతా ఆహ్లాదంగా గడిపేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. మరెందుకు ఆలస్యం.. దసరా సెలవుల్లో అనంతగిరికి వచ్చి ఇక్కడి అందాలను ఆస్వాదించి వద్దాం పదండి.

అనంతగిరి విశేషాలు
- విస్తరించిన ప్రాంతం 3750 ఎకరాలు
- వన్య ప్రాణులు 16
- పక్షులు 75
- ఔషధ వృక్షాలు 307



బోటింగ్ షికారు

వికారాబాద్‌ను ఆనుకొని వేలాది ఎకరాల్లో విస్తరించిన అనంతగిరి అటవీ ప్రాంతంలోని ఔషధ మొక్కలను గుర్తించిన అప్పటి నిజాం ఏడో నవాబు మీర్ ఉస్మాన్‌అలీఖాన్ ఛాతీ వైద్య ఆసుపత్రి (క్షయ చికిత్సాలయం) నిర్మించారు. ఇక్కడికి సమీప పట్టణాలు, గ్రామాలతో పాటు కర్ణాటక రాష్ట్రం బీదర్, గుల్బర్గాకు చెందిన క్షయ పీడితులు వచ్చి చికిత్స పొందుతున్నారు. ఎన్నో రకాల పక్షులు, వన్యప్రాణులకు ఈ ప్రాంతం నెలవైందని తెలిసింది. దెహ్రాడూన్ నుంచి ఔషధ మొక్కలు తీసుకొచ్చి అనంతగిరిలో నాటి ఔషధ వనం రూపొందించడానికి కృషి జరుగుతోంది.

ఔషధ మొక్కల సంరక్షణ

అటవీ ప్రాంతంలోని మైదానాలు, ఖాళీ ప్రదేశాల్లో ఔషధ మొక్కలు నాటారు. వాటికి నష్టం వాటిల్లకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం అనువైన ప్రదేశాల్లో వేప, జిల్లేడు, నక్కెర, బిల్వేడు, ఉసిరి, మర్రి, మేడి, దంతి, గుంపెన, ఇప్ప, మామిడి, చింత, నల్లజీడి, చిల్ల, తాని, కరక, పాలకొడిశ తదితర ఔషధాలకు చెందిన వాటిని నాటి సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

బుగ్గ రామలింగేశ్వరాలయం

అనంతగిరికి వచ్చిన పర్యాటకులు బుగ్గ రామలింగేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటుంటారు. త్రేతాయుగంలో రాముడు రావణ సంహారం తర్వాత ఈ ప్రాంతంలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. శివలింగాన్ని అభిషేకించేదుకు రాముడు బాణం వేసి పాతాళగంగను పైకి రప్పించారని ప్రతీతి. గంగ బుడగ రూపంలో రావడంతో బుగ్గ రామలింగేశ్వరుడు అన్న పేరు వచ్చిందని చరిత్ర. ఆలయంలోని నంది నోట్లో నుంచి నిరంతరం నీటి ధార వస్తూనే ఉంటుంది.

ప్రాజెక్టు చెంత

అనంతగిరిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు వికారాబాద్‌కు 24 కి.మీ. దూరంలో ధారూర్ అటవీ ప్రాంతంలో ఈ ప్రాజెక్టు ఉంది. ప్రకృతి ప్రేమికులను ఇట్టే ఆకట్టుకుంటుంది. బోటింగ్ షికారు చేసే అవకాశం ఉండటంతో అత్యధికులు ఇక్కడికి వస్తుంటారు. దట్టమైన చెట్లతో కూడిన ప్రకృతి రమణీయ దృశ్యాలను చూసి తరించాల్సిందే. శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో సందడిగా ఉంటుంది.

ఔషధ మొక్కల సంరక్షణకు..

ఇప్పటికే ఈ ప్రాంతంలో ఎన్నో రకాల ఔషధ మొక్కలున్నాయి. మరిన్ని సంరక్షించేందుకు ప్రణాళికతో అడుగులేస్తున్నాం. అటవీ అభివృద్ధికి సైతం అన్ని రకాల కృషి జరుగుతోంది. ఇక్కడికొచ్చే సందర్శకులకు వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.
జ్ఞానేశ్వర్, డీఎఫ్‌వో

ప్రతిభ వెలికి తీసేందుకే పోలీసు డ్యూటీ మీట్



సంగారెడ్డి జిల్లా పోలీసు అధికారులతో సమావేశమైన మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ప్రతిభను వెలికి తీయడానికి పోలీసు డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నామని మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో పోలీసు డ్యూటీ మీట్‌లో భాగంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నేరం జరిగిన తర్వాత ఆధారాల సేకరణపై జాగ్రత్తలను వివరించారు. ఈ నెల 14 నుంచి 18 వరకు రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జోనల్ స్థాయిలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. జోనల్ స్థాయిలో... నారాయణఖేడ్ ఎస్సై విద్యాచరణ్‌రెడ్డి(ప్రథమ), వికారాబాద్ సీఐ రఘురాం (ద్వితీయ), కొండాపూర్ ఎస్సై హరిశ కరగొండ్ తృతీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎస్పీ రూపేష్, అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీలు సత్యయ్యగౌడ్, రామోహన్‌రెడ్డి, నరేందర్, వికారాబాద్ డ్యూటీ మీట్ నోడల్ అధికారి, ఏఆర్ డీఎస్పీ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేటలోని క్రీడామైదానంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-14 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మందిని ఎంపిక చేశామని ఎస్జీఎఫ్ కార్యదర్శి సౌందర్య వెల్లడించారు. 7వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

ఐఐటీహెచ్‌లో హాఫ్ మారథాన్ పోటీలు

ఈ నెల 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: భారతీయ సాంకేతిక సంస్థ-హైదరాబాద్(ఐఐటీహెచ్) రన్నర్స్ క్లబ్ ఆధ్వర్యంలో హాఫ్ మారథాన్ పేరుతో పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 31 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివిధ రాష్ట్రాలు, నగరాలకు చెందిన వారిని ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. డిసెంబరు 1న ఐఐటీ క్యాంపస్ ఆవరణలో ఉదయం 5 గంటలకు 21.1 కి.మీ. హాఫ్ మారథాన్, 10, 5 కి.మీ పరుగు పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు https:///www.iithydrun-nersclub.comegistration ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పతకాలు, ధ్రువపత్రాలు అందించనున్నట్లు తెలిపారు.

వేర్వేరు కారణాలు.. ఐదు బలవన్మరణాలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో వేర్వేరు కారణాలతో ఐదుగురు ఆత్మహత్యలు చేసుకోవడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఒకే రోజు ఐదు ఘటనలు జరగడం.. జిల్లా పోలీసులను ఉలికిపాటుకు గురిచేసింది.

ఆ తల్లి శోకం తీరనిది..



లక్ష్మణ్

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: భర్త దూరం కాగా, ఉన్న ఒక్క కొడుకే తన సర్వస్వం అనుకుంది ఆ తల్లి. ఇంతలో ఆర్థిక ఇబ్బందులతో కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో ఆమెకు తీరని వేదన మిగిలింది. మెదక్ జిల్లా అల్లాదుర్గం ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. అల్లాదుర్గంకు చెందిన లక్ష్మి భర్త నర్సింలు పదేళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కూలీ పనులు చేస్తూ కుమారుడు లక్ష్మణ్(23)ను పోషించింది. కూలీ పని చేసుకొని దసరాకు దుస్తులు కొనుక్కొని వస్తానని కుమారుడు పది రోజుల క్రితం సంగారెడ్డికి వెళ్లాడు. శుక్రవారం అల్లాదుర్గం శివారులోని పటేల్ చెరువులో ఓ యువకుడి మృతదేహాన్ని స్థానికులు పరిశీలించి.. దుస్తుల ఆధారంగా లక్ష్మణ్‌దని నిర్ధారించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

భార్య ఆరోగ్యం క్షీణించడంతో..



మహేశ్

చిలప్‌చెడ్: మెదక్ జిల్లా చిలప్‌చెడ్‌కు చెందిన మహేష్(33), సావిత్రి భార్యాభర్తలు. సావిత్రి ఆరోగ్యం క్షీణించడంతో 15 రోజులుగా పుట్టింట్లో ఉంటోంది. మనస్తాపం చెందిన భర్త శుక్రవారం తన పెద్దన్న యాదయ్య ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. సావిత్రి ఫిర్యాదు మేరకు చిలప్‌చెడ్ ఎస్సై యాదగిరి కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు..



క్రిష్ణ

కౌడిపల్లి: కౌడిపల్లికి చెందిన బర్ల క్రిష్ణ(44), శోభ దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. అతను వ్యవసాయం, సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆమె వార్డు మాజీ సభ్యురాలిగా పనిచేశారు. ఒక కుమార్తెకు పెళ్లి చేశారు. వివిధ అవసరాలకు చేసిన అప్పులు తీరక క్రిష్ణ సతమతమవుతున్నాడు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. భార్య శోభ ఫిర్యాదుతో ఎస్సై రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేశారు. కుమారుడు లేకపోవడంతో తల్లి లచ్చమ్మ అంత్యక్రియలు చేసింది.

ఇంటికి చేసిన అప్పు భారమై..



మహేష్

కొండపాక గ్రామీణం: కొండపాకకు చెందిన శ్రీరాం మహేష్(38), రమ దంపతులకు ఒక కుమార్తె ఉంది. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల రూ.3 లక్షలు అప్పు చేసి కొత్తింటిని నిర్మించుకున్నారు. 15 రోజుల క్రితమే గృహప్రవేశం చేశారు. చేసిన అప్పు తీర్చే విషయంలో మనస్తాపం చెందిన మహేష్ శుక్రవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబీకులు గమనించి, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. రమ ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

భూవివాదంతో మనస్తాపం చెంది..



అశోక్

రామాయంపేట: ఎకరం భూ వివాదంతో మనస్తాపం చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్‌కు చెందిన ఎర్ర అశోక్(38)కు దాయాదులకు సుమారు ఎకరా భూమి విషయమై కొంత కాలంగా వివాదం నెలకొంది. పలుమార్లు పంచాయితీ నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు. మనస్తాపం చెందిన అశోక్ తన పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. బాధిత కుటుంబీకులు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తరలించమని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారికి నచ్చజెప్పి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భూ వివాదంతోనే తన భర్తను చంపారని భార్య బాబాయి ఆరోపించింది. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

పరిశోధన ఫలాలు రైతులకు అందించడమే లక్ష్యం



పత్రాలు మార్చుకుంటున్న నీరజ ప్రభాకర్, వీవీయో గ్లోబల్ సంస్థ ప్రతినిధులు

ములుగు, న్యూస్‌టుడే: ఉద్యాన పంటలపై చేసిన పరిశోధనల ఫలితాలను రైతులకు అందించాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్, ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి నీరజా ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పరిపాలన విభాగం కార్యాలయంలో వర్సిటీ, వీవీయో గ్లోబల్ సంస్థల మధ్య పలు అంశాలపై పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడారు. వీవీయో గ్లోబల్ సంస్థ.. దక్షిణ కొరియా దేశానికి చెందిన పలు సంస్థలతో కలిసి పరిశోధనలు చేస్తుందన్నారు. రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు రాజశేఖర్, లక్ష్మీనారాయణ, విజయ, సంస్థ ప్రతినిధి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషితోనే బడుల పరిరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య(యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సంఘం జిల్లా స్థాయి అధ్యయన తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సమాజం పట్లలోతైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వివిధ రకాల కారణాల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గుతోందన్నారు. సర్కారు పాఠశాలల పరిరక్షణకు ప్రతి యూటీఎఫ్ కార్యకర్త పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యారంగ పరిణామాలు అనే అంశంపై కార్యకర్తలకు బోధించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, జిల్లా అధ్యక్షుడు షేక్ వలీ అహ్మద్, కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

మలుపులో ఢీకొన్న బస్సు, కారు

ఒకరి దుర్మరణం, ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కల్హేర్, న్యూస్‌టుడే: మలుపు వద్ద ఆర్టీసీ బస్సు-కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా.. ముగ్గురికి గాయాలయ్యాయి. నిజాంపేట్ మండలం మునిగేపల్లి శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశం తెలిపిన వివరాలు.. రేగోడు మండలం గజ్వాడలోని ఒకే కుటుంబానికి చెందిన భూమవ్వ(55), పాపయ్య, దుర్గయ్య, స్వరూప, రుత్వి, పుంతి హైదరాబాద్‌కు వెళ్లి శుక్రవారం తిరుగు పయనమయ్యారు. నిజాంపేట్ మండలం మునిగేపల్లి శివారులోని మలుపు వద్ద ఎదురుగా వచ్చిన నారాయణఖేడ్ డిపోకు చెందిన బస్సు వారు ప్రయాణిస్తున్న కారును ఢీకొంది. ఈ ఘటనలో భూమవ్వ(55) అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె భర్త పాపయ్య, కుమారుడు దుర్గయ్య, కోడలు స్వరూపలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని వెంటనే 108 అంబులెన్సులో నారాయణఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. గాయపడినవారి పరిస్థితి విషమంగా ఉండటంతో పాపయ్య, స్వరూపను మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిని ఎస్సై పరిశీలించి.. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.


బైక్ అదుపుతప్పి యువకుడు..



జావిద్

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మోమిన్‌పేట ఠాణా పరిధిలో గురువారం రాత్రి జరిగింది. ఎస్సై అరవింద్ తెలిపిన ప్రకారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణం కటికే గేరికి చెందిన మహ్మమద్ పాషమియా, ఫర్జాన దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. చిన్నకుమారుడు మహ్మమద్ జావీద్(24), అతని మిత్రుడు మహాజ్‌పటేల్‌తో కలిసి గురువారం కోట్‌పల్లికి వెళ్లారు. అదే రోజు రాత్రి సదాశివపేటకు తిరిగి వస్తుండగా, మండల పరిధి మోరంగపల్లి శివారులో రోడ్డుపై గుంత ఉండడంతో, వాహనం అదుపు తప్పి ఇద్దరూ కింద పడ్డారు. జావిద్ తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మహాజ్‌కు గాయాలు కావడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడినుంచి గాంధీకి తరలించారు. శుక్రవారం జావీద్ అన్న హనీఫ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై వివరించారు.

సర్పం.. స్నేహపూర్వకం



పాములు.. రైతులకు, వన్యప్రాణుల సమతుల్యానికి స్నేహకారకమయ్యేవి. అన్ని పాములూ విషపూరితమైనవి కావు. వీటి అవగాహన కోసం 70వ 'వన్యప్రాణి వారోత్సవాలు' పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, రాకేశ్ ప్రదర్శన నిర్వహించారు. ఉపాధి హామీ పథకం, అటవీ శాఖ సిబ్బందికి సర్పాలపై అవగాహన కల్పించారు. డీఆర్డీవో జయదేవ్ ఆర్య, అటవీశాఖ క్షేత్ర అధికారి ఇక్రముద్దీన్, దుబ్బాక రేంజ్ అధికారి సందీప్‌కుమార్ పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

ఈఎస్‌ఐ ఆసుపత్రికి రెండోసారి తాళం



తూప్రాన్, న్యూస్‌టుడే: పుర పరిధి పోతురాజుపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఈఎస్‌ఐ ఆసుపత్రికి యజమాని తాళం వేయడంతో సేవలు నిలిచిపోయాయి. పది నెలలకు సంబంధించిన అద్దె బకాయిలు రాకపోవడంతో గత ఏప్రిల్‌లో తాళం వేశాడు. అప్పుడు బకాయిలు చెల్లించి తాళం తీయించారు. పుర పరిధిలోకి మారాక దాని ప్రకారం అద్దె చెల్లించాలని డిమాండ్ చేస్తూ మరోసారి శుక్రవారం తాళం వేశాడు. ఈ విషయమై ఆసుపత్రి వైద్యుడు సాయిభరత్‌ను వివరణ కోరగా.. అద్దె పెంచాలని కోరుతూ యజమాని తాళం వేశాడన్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

నలుగురు దొంగల రిమాండ్

చేగుంట, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రికలను ధ్వంసం చేస్తూ అందులో నుంచి కాపర్ కాయిల్స్‌ను చోరీ చేస్తున్న నలుగురు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చేగుంట ఎస్సై చైతన్యరెడ్డి తెలిపారు. హరియాణకు చెందిన జుబేర్‌ఖాన్, ఇర్షాద్, రాజస్థాన్‌కు చెందిన ఫజార్, జాహిద్‌లు చేగుంట పోలీసు స్టేషన్ పరిధిలోని పోతాన్‌శెట్టిపల్లిలో విద్యుత్తు నియంత్రికను 15 రోజుల క్రితం ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ కాయిల్స్‌ను చోరీ చేసి విక్రయించారు. అలాగే గత నెలలో మాసాయిపేటలో జప్తు చేసిన రైస్‌మిల్లులో ఉన్న విద్యుత్తు నియంత్రికలోని కాపర్ కాయిల్స్‌ను చోరీ చేశారు. వీటిని విక్రయించేందుకు కారులో తీసుకెళ్తున్నారు. వడియారం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి వారిని పట్టుకొని విచారించగా రెండో చోట్ల చోరీ చేసినట్లు అంగీకరించారు. కారుతో పాటు అందులో ఉన్న కాపర్ కాయిల్స్‌ను స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అత్యాశకు పోయి.. జైలుపాలు

పురాతన విగ్రహం చోరీ కేసులో ఐదుగురి అరెస్టు



టేక్మాల్‌లో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

టేక్మాల్, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ చదివి జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాల్సిన యువకులు అత్యాశకు పోయి జైలుపాలయ్యారు. జైన విగ్రహాన్ని చోరీ చేసి విక్రయించేందుకు సిద్ధమైన ఐదుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి శుక్రవారం వివరాలు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంటకు చెందిన అనువింద్, జగత్, పెద్దపేటకు చెందిన శుభానంద్, కృష్ణా జిల్లా చల్లపల్లి గ్రామానికి చెందిన తేజసాయి బాబు, పామర్రుకు చెందిన మహేశ్‌బాబు హైదరాబాద్‌లో బీటెక్ చదివారు. రాత్రికిరాత్రే డబ్బులు సంపాదించాలని యూట్యూబ్, సామాజిక మాధ్యమాల ఆధారంగా పురాతన దేవాలయాలు గుర్తించారు. వెల్పుగొండలోని గుట్టపై పార్శ్వనాథుని పురాతన విగ్రహం ఉన్న విషయం తెలుసుకున్నారు. జులై 26న ఇక్కడికి చేరుకొని విగ్రహాన్ని తీసుకెళ్లారు. విగ్రహానికి సరైన ధర రాకపోవడంతో అమ్మలేదు. గ్రామస్థుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఐదుగురు నిందితులను పట్టుకున్నారు. విగ్రహాన్ని గ్రామస్థులకు అప్పగించి, నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి, టేక్మాల్ ఎస్సై రాజేశ్‌లు ఉన్నారు. వెల్పుగొండ మాజీ సర్పంచి నారాయణతో పాటు గ్రామస్థులు ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి డీఎస్పీ, సీఐ, ఎస్సైలను సన్మానించారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి దుర్మరణం



మల్ల రాజు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేటలో చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని నర్సాపురానికి చెందిన రెడ్డిమల్ల మల్లవ్వ, శరబంధు దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. గతంలోనే శరబంధు మృతి చెందాడు. మల్లవ్వ కూతురు పెళ్లి చేసింది. కుమారుడు రాజు (34) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కోమటిచెరువు నుంచి బయటకు వచ్చే నీటిలో మంగళవారం గాలం వేశాడు. బుధవారం రాత్రి చేపల వేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లేకపోవడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున నీటిలో రాజు మృతదేహం తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

ఆరేళ్లకు రాష్ట్రస్థాయి పోటీలకు ఆతిథ్యం



ఇందిరా గాంధీ స్టేడియంలోని క్రీడా మైదానం

పోటీలో పాల్గొనే వారి వివరాలు
- జట్లు: 10 (ఉమ్మడి జిల్లాలు)
- వ్యాయామ ఉపాధ్యాయులు: 42
- రిఫరీలు: 06
- కోచ్‌లు, మేనేజర్లు: 20
- క్రీడాకారులు: 180

జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించడంతో పాటు బాక్సింగ్ అకాడమీగా జాతీయస్థాయిలో ప్రసిద్ధి చెందిన మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానం.. ఆరేళ్ల తర్వాత మళ్లీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు ముస్తాబైంది. 2017-18లో జాతీయ, 2016-17 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఇక్కడే జరిగాయి. ఆ తర్వాత ప్రజాప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు చొరవతో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ.5.50 కోట్లు మంజూరయ్యాయి. ఇందుకు ఆరేళ్ల కిందట మైదానాన్ని మూసేశారు. సింథటిక్ ట్రాక్ నిర్మాణం పూర్తవగా, దీని మధ్యలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.40 లక్షలతో ఫుట్‌బాల్ మైదానాన్ని ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఇందులోనే పోటీలు జరుగనున్నాయి. స్టేడియం మొత్తం 7 ఎకరాలలో విస్తరించి ఉండగా, ఇక్కడ నిర్మించి గ్యాలరీలో 20 వేల మంది ప్రేక్షకులు కూర్చోవచ్చు.

మూడు రోజులు

ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల రాష్ట్ర స్థాయి పోటీలను ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరుగనున్నాయి. ఇందిరాగాంధీ మైదానంతో పాటు వెస్లీ పాఠశాల మైదానంలోనూ పోటీలు జరుగనున్నాయి. మొత్తం 24 మ్యాచ్‌లు జరుగుతాయి. స్థానిక టీజీ ఆర్‌ఎస్ పాఠశాలలో క్రీడాకారిణులకు వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు.

- రాష్ట్రంలో పచ్చికతో కూడి ఉన్న ఏకైక స్టేడియం మెదక్‌దే కావడం విశేషం. 110 మీ. పొడవు, 70 మీ. వెడల్పుతో విస్తరించి ఉంది. జాతీయ స్థాయి పోటీలు పచ్చిక మైదానాల్లోనే కొనసాగుతాయి.

- న్యూస్‌టుడే, మెదక్ టౌన్

అన్ని ఏర్పాట్లు పూర్తి..: నాగరాజు, ఫుట్‌బాల్ అసోసియేషన్, ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి



క్రీడాకారిణులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఆరేళ్ల తర్వాత తొలిసారిగా రాష్ట్ర స్థాయి పోటీలు జిల్లాలో జరుగుతున్నాయి. ప్రశాంతంగా పూర్తిచేసేలా, జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు వచ్చేలా అందరం కలిసి కృషి చేస్తున్నాం.

పండగల వేళ రైట్.. రైట్

- ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- రద్దీకి అనుగుణంగా నడిపేందుకు కార్యాచరణ

ప్రత్యేక సర్వీసులు ఇలా.. (డిపో – బస్సులు)

డిపో	బస్సులు	డిపో	బస్సులు
మెదక్	79	నర్సాపూర్	97
నారాయణఖేడ్	55	సిద్దిపేట	59
సంగారెడ్డి	72	దుబ్బాక	13
జహీరాబాద్	86	పరిగి	16
తాండూరు	10	వికారాబాద్	8
గజ్వేల్-ప్రజ్ఞాపూర్	39		

బతుకమ్మ, దసరా పండగలను అత్యధికులు సొంతూరిలో వేడుక చేసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తారు. ఇందుకు సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ఆర్టీసీ బస్సు ప్రయాణానికి మొగ్గు చూపుతుంటారు. ఈ నేపథ్యంలో పండగల రద్దీ దృష్ట్యా ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ కార్యాచరణ రూపొందించింది.

రీజియన్ పరిధిలో..

మెదక్ రీజియన్ పరిధిలోని సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో 8, రంగారెడ్డి రీజియన్‌లోకి వచ్చే వికారాబాద్ జిల్లాలో మూడు డిపోలు ఉన్నాయి. ఆయా డిపోల పరిధిలో ప్రత్యేక బస్సు సర్వీసులకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు. పండగల సందర్భంగా రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇక్కట్లు లేకుండా 500 సర్వీసులను నడపాలని నిర్ణయించారు. ప్రత్యేక సర్వీసులు ఈనెల 11 వరకు నడిపిస్తారు.

ఇబ్బంది లేకుండా..

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలకు చెందిన చాలా మంది ఉద్యోగ, ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారు. కొంతమంది అక్కడే స్థిరపడ్డారు. బతుకమ్మ, దసరా పండగలకు వారిలో అత్యధికులు సొంతూరికి వస్తుంటారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా బస్సులను ఆర్టీసీ అధికారులు నడిపించనున్నారు.



- వికారాబాద్ జిల్లాలో పాఠశాలలకు చెందిన 40 బస్సులు వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించారు.

ముందస్తు రిజర్వేషన్‌కు..

దూర ప్రాంతాలకు వెళ్లే వారు ముందస్తుగా బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని ఆర్టీసీ కల్పించింది. ముందస్తు టికెట్ రిజర్వేషన్‌కు www.tsrtconline.in/www.tgsrtcbus.in వెబ్‌సైట్‌లో సంప్రదించాల్సి ఉంటుంది.

– న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, పరిగి

సద్వినియోగం చేసుకోవాలి: ప్రభులత, ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్



బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ప్రత్యేక బస్సులను నడుపుతున్నాం. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రద్దీకి అనుగుణంగా సర్వీసులు నడిపేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఈమేరకు డిపో మేనేజర్లకు ఆదేశాలు ఇచ్చాం.

వర్గీకరణ ప్రకారమే నియామకాలు చేపట్టాలి

న్యూస్‌టుడే, కుల్కచర్ల: ఎస్సీ ఎస్టీ వర్గీకరణ ఆధారంగానే డీఎస్సీ నియామకాలను చేపట్టాలని ఆదివాసీ సంఘం నాయకులు రాములు తదితరులు కోరారు. సంఘం సభ్యులతో కలిసి తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు.

సీపీఎం మహాసభలు 8, 9న

పెద్దేముల్, న్యూస్‌టుడే: జిల్లాలో సీపీఎం మూడో మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పెద్దేముల్‌లో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈనెల 8, 9 తేదీల్లో తాండూర్ పట్టణంలో మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

పంట సస్యరక్షణ చర్యలు అవసరం

పరిగి గ్రామీణ: పత్తి, కంది పంటలకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పరిగి మండల వ్యవసాయాధికారి రజిత అన్నారు. శుక్రవారం రాపోల్‌లోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో గ్రామ రైతులు నాగవర్ధన్‌రెడ్డి, వెంకటేష్, ఇన్‌ఛార్జి ఏఈవో శశాంక్ పాల్గొన్నారు.

చుక్కనీరు చిక్కదాయె!

● ఖాళీ అవుతున్న చెక్‌డ్యాంలు

న్యూస్‌టుడే, ధారూర్:

భారీ వర్షాలు కురిసి వాగులు, వంకల్లో నుంచి పుష్కలంగా చేరినా.. కొన్ని రోజుల్లోనే వాటిలో చుక్కనీరు నిలువని దుస్థితి నెలకొంది. ఆనకట్టలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో చెక్‌డ్యాంలు సైతం ఖాళీ అవుతున్నాయి. రైతుల పొలాలకు పక్కనే జలవనరులు ఉన్నా.. అందులోని జలాల్ని సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి నెలకొంది. అంతేకాదు.. పరిసర ప్రాంతాల్లోని బోరు బావుల్లో నీటి మట్టం పెరిగి సాగు, తాగు నీటితో పాటు అడవి జంతువులకు సైతం తాగునీరు దొరుకుతుందని వేసవిలో జల సమస్య నివారించవచ్చని పలువురు భావించారు. కానీ పరిస్థితి మారింది. గత కొన్నేళ్లుగా అధికారులు వాటి నిర్వహణ చేపట్టకపోవడంతో వేసవిలో భూగర్భ జలాలు తగ్గిపోయి ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కుక్కిందలో శిథిలావస్థకు చేరిన ఆనకట్ట

మచ్చుకు కొన్ని..

● మైలారం గ్రామ శివారులో గతంలో వాగుకు అడ్డుగా ఆనకట్ట నిర్మించారు. అందులో పుష్కలంగా జలం నిలువ ఉండేది. వేసవిలో పశువులు అక్కడ దాహం తీర్చుకునేవి. గతంలో కురిసిన వర్షాలకు దెబ్బతిని కట్టలకు పగుళ్లు ఏర్పడి వరద తాకిడి కొట్టుకుపోయి జలం వృథాగా పోతుంది.

● ధారూర్ గ్రామ శివారులోని ఆనకట్ట ద్వారా రైతులు పంటలకు వివిధ అవసరాలకు నీటిని ఉపయోగించుకునేవారు. మరమ్మతులకు చేరడంతో అక్కడా వృథాగా పోతుందని రైతులు పేర్కొంటున్నారు. ● కుక్కింద గ్రామ శివారులో గతంలో నిర్మించిన ఆనకట్ట వరద ఉద్ధృతికి కొట్టుకుపోయి నిలువ ఉండలేని పరిస్థితి నెలకొంది. ● అవుసుపల్లి గ్రామ శివారులో ఆనకట్టకు మరమ్మతులు చేపట్టిన మట్టి, పొదలతో నిండి జలం నిలువ ఉండని దుస్థితి.



మైలారం శివారులో ఆనకట్ట నుంచి వృథాగా నీరు

కొత్తవి నిర్మించుకునే అవకాశమే ఉంది

గతంలో నిర్మించిన ఆనకట్టల మరమ్మతుల కోసం నిధులు లేవు. కొత్తగా ఆనకట్టలు నిర్మించుకునే అవకాశమే ప్రస్తుతం ఉంది. ఏళ్ల కిందట నిర్మించినవి చాలా చోట్ల ధ్వంసం అయ్యాయని మా దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారులకు సమస్య వివరించి బాగు చేయించేందుకు ఉన్న అవకాశాల్ని పరిశీలిస్తాం. కొత్తగా ప్రతిపాదనలు పంపిస్తాం. సురేష్, ఏపీవో

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ: ? పీరంపల్లి చౌరస్తాలో ఆకాశదీపాలు ఏర్పాటు చేయించాల్సిన అవసరం ఉంది. అవి లేకపోవడంతో రాత్రి సమయంలో పూర్తి స్థాయిలో వెలుతురు ఉండడం లేదు. – జంగయ్య, స్థానికుడు

✔ ఈ సమస్యను పరిష్కరించడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నాం. – సంజీవ్, పంచాయతీ కార్యదర్శి.

న్యూస్‌టుడే, దౌల్తాబాద్: ?: మండల కేంద్రంలో దోమలతో తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కాలనీలలో పిచ్చిమొక్కలు, పారిశుద్ధ్యం లోపించింది. ఈ సమస్య పరిష్కరించండి. – రఘు, దౌల్తాబాద్.

✔ దోమల నివారణకు ఫాగింగ్ యంత్రంతో మందు పిచికారీ చేయించి దోమల నివారణకు తగు చర్యలు తీసుకుంటాం. –గోపాల్, పంచాయతీ కార్యదర్శి, దౌల్తాబాద్.

న్యూస్‌టుడే, కొడంగల్: ? బీఎస్ఎన్ఎల్ సెల్‌ఫోన్ సిగ్నల్ సరిగ్గా పనిచేయడం లేదు. –బాలకిష్టయ్య, కొడంగల్.

✔ బీఎస్ఎన్ఎల్ సెల్ ఫోన్‌లలో 2 జీ, 3జీ సిగ్నల్ గత మూడు, నాలుగు రోజులుగా ఇబ్బంది ఉన్న మాట వాస్తవమే. లైన్‌లను పరిశీలిస్తున్నాం. మరో రెండు రోజుల్లో సరిచేయడం జరుగుతుంది. –శ్రీనివాస్, బీఎస్ఎన్ఎల్ లైన్‌మెన్, కొడంగల్.

న్యూస్‌టుడే, దోమ: ? పాలేపల్లి కొత్తకాలనీలో వర్షం పడితే నివాసాల మధ్య నీరు నిలిచి మడుగులా మారుతుంది. బయటకు వెల్లడానికి ఇబ్బందిగా ఉంది. – వెంకటయ్య, పాలేపల్లి

✔ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరైతే నిర్మించి పరిష్కారానికి కృషి చేస్తాం. –సోమలింగం– ఎంపీఈవో దోమ.

న్యూస్‌టుడే, తాండూరు టౌన్: ? శాంతినగర్ కాలనీ ప్రాంతంలోని వీదుల్లో చెత్త కుప్పలు పూర్తి స్థాయిలో తొలగించటం లేదు. – రాజు, తాండూరు.

✔ చెత్త కుప్పలు పూర్తి స్థాయిలో తొలగించటానికి చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించటానికి కృషి చేస్తాం.
– విక్రమ సింహారెడ్డి, పురపాలక సంఘం కమిషనరు తాండూరు

క్రీడాకారుల ర్యాలీకి స్వాగతం



మోమిన్‌పేటలో విద్యార్థుల ప్రదర్శన

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: అధికారులు, విద్యార్థులు మోమిన్‌పేటలో క్రీడాకారులకు స్వాగతం పలికారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు (సీఎం) ముఖ్యమంత్రి కప్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అధికారులు ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ సంగారెడ్డి మీదుగా వెళ్లేందుకు శుక్రవారం మోమిన్‌పేటకు చేరుకుంది. గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్న, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి క్రీడాకారులకు ఘనస్వాగతం పలికారు.

భక్తిశ్రద్ధలతో నవరాత్రి పూజలు



రామానంద ఆలయంలో హోమం

కుల్కచర్ల, న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాలను ఆయా గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుల్కచర్ల ఇప్పాయిపల్లి, చౌడాపూర్ తదితర చోట్ల దుర్గామాత విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రామానంద ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం చేపట్టారు.

దోమ: విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నర్సయ్య మాట్లాడుతూ.. యువత ఆధ్యాత్మిక మార్గంలో నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. మోత్కూర్, పాలేపల్లి, ఐనాపూర్ గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దౌల్తాబాద్: గాయత్రిమాతగా అమ్మవారు దర్శనం ఇచ్చారు. నీటూరు, ఈర్లపల్లి, బాలంపేట, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో పూజలు నిర్వహించారు.

కుల్కచర్లగ్రామీణ: గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

రోడ్డుపక్కన లారీల తిష్ట



తాండూరు- సంగారెడ్డి మార్గంలో

తాండూరు, పెద్దేముల్: తాండూరు - సంగారెడ్డి మార్గంలోని మారెపల్లి గ్రామ సమీపంలో పరిస్థితి ఇది. సుద్ద కర్మాగారం వద్దకు లోడింగ్ కోసం వచ్చిన లారీలను శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు యజమానులు లోపలికి అనుమతించలేదు. దీంతో డ్రైవర్లు లారీలను ప్రధాన రహదారికి ఒకవైపు పొడవునా నిలువరించారు. దీంతో వచ్చిపోయే వాహనాలు ఒకే వైపు నుంచి రాకపోకలు సాగించడంతో ఇబ్బందులు తలెత్తాయి. లోడింగ్ కోసం వచ్చిన లారీలను కర్మాగారం యాజమాన్యం లోపలికి అనుమతి ఇచ్చి ఉంటే ఈ సమస్య తలెత్తేది కాదని చోదకులు పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై..: కొడంగల్: జాతీయ రహదారి నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. బీజాపూర్, హైదరాబాద్ మార్గంలో కొడంగల్ పట్టణంలోని ఓ పెట్రోల్ పంపు సమీపంలో దుస్థితి ఇది. రోడ్డు పక్కన వాహనాలు ఆపే ప్రదేశంలో సిమెంటు ఇటుకలు కుప్పగా ఉన్నా.. పట్టించుకోవడం లేదు. ఇలానే నెలలు గడుస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు

పరిగి: పరిగిలో శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు జరిగాయి. పట్టణంలోని కొడంగల్ చౌరస్తా నుంచి బీజాపూర్ -హైదరాబాద్ జాతీయ రహదారిపై విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీ మినీ స్టేడియం వరకు కొనసాగింది. అనంతరం స్టేడియం ఆవరణలో బతుకమ్మ ఆటాడారు. కార్యక్రమంలో పలువురు భాజపా, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

స్వయం సమృద్ధి సాధించడం అభినందనీయం

యాలాల, న్యూస్‌టుడే: మహిళలు స్వయం సమృద్ధి సాధించడం ఎంతో అవసరమని యాలాల మాజీ సర్పంచి సిద్రాల సులోచన అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మహిళా శక్తి ఎంటర్‌ప్రైజ్ ద్వారా మహిళ ఏర్పాటు చేసిన షాపులను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఐకేపీ ఏపీఎం ప్రమీల, ఐకేసీ సీసీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

పెద్దేముల్, న్యూస్‌టుడే: క్రీడాపోటీల నిర్వహణతో వ్యక్తుల మధ్య స్నేహభావం పెరుగుతుందని ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం పెద్దేముల్‌లో చిట్టెపు ప్రకాష్ రెడ్డి స్మారకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోటీల్లో 40 జట్లు పాలుపంచుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు జితేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు కిషన్ రావు, ఎర్ర బాలప్ప, ఇందూరు ప్రకాష్, ప్రవీణ్ కుమార్, డీవై నర్సింలు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి

ఇంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయం: సబితారెడ్డి

పూడూరు: దివంగత ఇంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయసాధనకు కృషి చేస్తున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా అంగడిచిట్టంపల్లి గేటువద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ భారాస నాయకులు అంజయ్యగౌడ్, వీరాంజనేయులు, విఘ్నేష్‌గౌడ్, విజయ్‌కుమార్, అనంతయ్య, రామస్వామి ఉన్నారు.

తాండూరుగ్రామీణ: మాజీ హోంమంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివని కోటబాస్పల్లికి చెందిన నాయకులు గొట్టిగరాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఇంద్రారెడ్డి జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కోటబాస్పల్లిలోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న సబితారెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే ఆనంద్

భగీరథ నీటి వృథా



దాస్యానాయక్ తండా సమీపంలో

కుల్కచర్ల, న్యూస్‌టుడే: కొద్ది రోజులుగా భగీరథ పైప్‌లీకేజీతో నీటివృథా జరుగుతోంది. దాస్యానాయక్ తండా నుంచి లింగంపల్లి దారిలో పైప్‌లైన్ లీకేజీ ఉన్నట్లు తెలిపారు. దీంతో నీళ్ల వృథాగా పోతున్నాయని అయినా సిబ్బంది స్పందించడం లేదని చెప్పారు. అధికారులు లీకేజీని అరికట్టాలని కోరారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పెద్దేముల్, న్యూస్‌టుడే: వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో మేలు కలుగుతుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారా సింగ్ అన్నారు. శుక్రవారం గాజీపూర్‌లో ఎల్ఎన్ఆర్ యువజన సంఘం, మహవీర్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 200 మంది ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ నారాయణరెడ్డి, నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సింలు, మాజీ కో- ఆప్షన్ సభ్యుడు నసీర్, లాల్‌రెడ్డి, వెంకటేష్, ప్రకాష్ రెడ్డి, మహేష్, వైద్యులు శ్రీమయి, సంకీర్తన, సాయి స్మరన, స్వరోచిత్, అతుల్, మతిన్ పాల్గొన్నారు.

సాగు వివరాలు నమోదు చేయించుకోండి

కుల్కచర్ల, న్యూస్‌టుడే: పంటల వివరాలను రైతులు వ్యవసాయ సిబ్బందికి సమాచారం ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. చౌడాపూర్ మండల పరిధిలోని కొత్తపల్లిలో పంటలను పరిశీలించారు. రైతులతో సూచనలను చేశారు. చీడపీడలు సోకితే అధికారుల సూచన మేరకు మందులను వాడాలన్నారు.

క్రికెట్ మైదానంలో పిచ్ ధ్వంసం

పూడూరు, న్యూస్‌టుడే: మన్నెగూడ సంత పక్కన ఉన్న క్రికెట్ మైదానంలో పిచ్‌ను ధ్వంసం చేశారని స్థానికులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. దసరా సెలవుల సందర్భంగా ఈనెల 5 నుంచి మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు కిజర్‌ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మైదానంలో సిమెంట్‌తో చేపట్టిన పిచ్ నిర్మాణాన్ని ధ్వంసమైంది. సీసీ ఫుటేజీలో పరిశీలించగా అర్ధరాత్రి జేసీబీ వచ్చినట్లు గుర్తించారు. కిజర్‌ఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాబోయ్.. నియంత్రికలు

ఇళ్ల మధ్య ప్రమాద ఘంటికలు

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ, కుల్కచర్ల: ఉమ్మడి కుల్కచర్ల మండలంలో 44 గ్రామ పంచాయతీలు ఉండగా 100కు పైగా గిరిజన తండాలు ఉన్నాయి. కుల్కచర్ల, చౌడాపూర్, దోమ మండలాల్లో ఇళ్ల మధ్యన నియంత్రికల సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. వాటిని తొలగించాలంటే స్తంభాలను మార్చాల్సి ఉంటుందని చాలా ఇబ్బందులు తప్పవని విద్యుత్తు సిబ్బంది చెప్పుకొస్తున్నారు. దీంతో ఈ సమస్యతో భయపడుతూ కాలం వెళ్ల దీయాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పీరంపల్లిలో ఇళ్ల మధ్యనే

ఉదాహరణలు కొన్ని..

● పీరంపల్లిలో నియంత్రికలు ఇళ్ల మధ్యన చాలా ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. వర్షాకాలంలో ఈ నియంత్రికల కారణంగా తరుచుగా విద్యుదాఘాతం వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● బండవెల్కిచర్ల ఎస్సీ కాలనీ సమీపంలో కూడా ప్రమాదకరంగా ఉన్నాయి. వాటి చుట్టూ రక్షణగా కంచెను ఏర్పాటు చేయించాల్సిన అవసరం ఉంది.

● సాల్వీడ్ గ్రామంలోని బీసీ కాలనీ నియంత్రికలు ఇళ్లకు మధ్యన కనిపిస్తున్నాయి. వర్షాలు, గాలులకు వాటి దగ్గర మంటలు వస్తున్నాయని కాలనీ వాసులు చెబుతున్నారు.

● హన్మ్యానాయక్‌తండాలో కూడా ఇదే పరిస్థితి ఉంది. చాలా రోజులుగా సమస్య అలాగే కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

● కామన్‌పల్లిలో ఇళ్లకు సమీపంలోనే నియంత్రికలు ఏర్పాటు చేశారు. నియంత్రికలు నేలను తాకే విధంగా ఉన్నాయి. దీంతో ప్రమాదం జరగడానికి అవకాశం ఉంది.

● దోమ మండలం పాలేపల్లిలో కూడా ఇళ్ల మధ్యన ఉన్నాయి. వాటిని తొలగించి వేరొక చోటుకు మార్చాల్సిన అవసరం ఉంది.

సమస్య పరిష్కరించేలా చూస్తాం

సాయికిరణ్, ఏఈ, విద్యుత్తు శాఖ

గ్రామాల్లో నియంత్రికలు ఇళ్ల మధ్యన ప్రమాదకరంగా ఎక్కడెక్కడ ఉన్నాయనేది గుర్తించడం జరుగుతుంది. ఈ సమస్య గతంలోనే మా దృష్టికి వచ్చింది. ప్రమాదకరంగా ఉన్న వాటిని తొలగించి వేరొక చోట ఏర్పాటు చేయించాలని ప్రజల నుంచి వినతులు వస్తున్నాయి. వేరొక చోటుకు మార్చాలంటే చాలా సమస్యతో కూడుకున్న విషయం. అందుకే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తాం.

ఇంటి నిర్మాణానికి అనుమతి తప్పనిసరి

కుల్కచర్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో గ్రామపంచాయతీ అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం చేపడితే తగిన చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి మండల పంచాయతీ అధికారి భాస్కర్ అన్నారు. అనుమతి లేని వాటికి తాఖీదులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలను మేరకు ఇళ్లను నిర్మించుకోవాలని అనుమతి లేని లేఅవుట్లో ఇళ్ల నిర్మాణాలను చేపట్టకూడదన్నారు.

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు



పత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో, కాంగ్రెస్ నాయకులు

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామని ఎంపీడీవో ఎం.ఎ.కరీం, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరశురాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు అన్నారు. శుక్రవారం పరిగి మండల పరిధిలోని రాఘవాపూర్, సుల్తాన్‌పూర్, నారాయణ్‌పూర్, లక్ష్మీదేవిపల్లి, సయ్యద్ మల్కాపూర్ గ్రామాలలో రూ.500 గ్యాస్ లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. గ్రామ పెద్దలు బాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, గ్రామాలాధ్యక్షుడు రాములు, జీపీ కార్యదర్శి మౌనిక, డీసీసీ నాయకులు రామకృష్ణారెడ్డి, వెంకట్రాంరెడ్డి, తావ్ర్యా నాయక్ పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఒకరికి గాయాలు

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: తాండూరు పట్టణం సాయిపూర్‌కు చెందిన రవి కర్ణాటక సేడంలోని శుభకార్యానికి వెళ్లి కారులో శుక్రవారం తిరుగు ప్రయాణమయ్యాడు. బెల్కటూరు వంతెనపై కారు ఒక్కసారిగా అదుపుతప్పి వంతెన కిందకు దూసుకెళ్లి బోల్తాపడింది. రవి స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

యువకుడికి సత్కారం

కొడంగల్: అన్నారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ నాలుగు ఉద్యోగాలకు అర్హత పొందిన విషయం తెలిసిందే. స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అతడిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు అభినందించారు.

మూణ్నాళ్ల ముచ్చటే!

నిఘానేత్రాలు ఉన్నా పనిచేయని తీరు

న్యూస్‌టుడే, పూడూరు

గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, పట్టణాలు వ్యాపార కేంద్రాలు, ప్రైవేటు సంస్థల వద్ద తప్పనిసరిగా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు పదే పదే చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే ఏర్పాటు చేసినా కొన్నాళ్లకే పాడయ్యాయి.

కీలక ప్రాంతాల్లోనూ..

● మన్నెగూడ కూడలి వ్యాపార కేంద్రంగా గుర్తింపు పొందుతుంది. జిల్లాకు సరిహద్దులో ఉండటంతో పాటు హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి కలిగి ఉంది. అక్కడా కెమెరాలు లేవు. ఉన్నా పనిచేయడం లేదు.

● వికారాబాద్, పరిగి, తాండూరు పట్టణాలకు కూడలి నుంచి నిత్యం ఎంతో మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సులతో పాటు అంతరాష్ట్ర సర్వీసులు తిరుగుతుంటాయి. ఎక్కడ చూసినా జనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది.



పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన తెరను పరిశీలిస్తున్న ఎస్సై



మీర్జాపూర్‌లో ఉపయోగం లేని నిఘా నేత్రాలు

● మన్నెగూడలో ప్రతి మంగళవారం వారాంతపు సంత జరుగుతుంది. నగరానికి సమీపంలో సంపన్నుల కుటుంబాలు అనేకం ఇక్కడ పొలాలు కొనుగోలు చేసుకుని వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రత్యేక దినాలు శని, ఆది వారాల్లో విడిది కోసం తమతమ వ్యవసాయ క్షేత్రాలకు వస్తుంటారు. దీంతో అనేక సంఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉంటుంది.

● ఇక్కడ సీసీ కెమెరాలు ఎంతో అవసరం అప్పట్లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కెమెరాలు నాణ్యత కోల్పోయి నిరుపయోగంగా మారటంతో కొన్ని కేసుల ఛేదనలో జాప్యం జరిగింది.

అన్ని గ్రామాల్లో ఏర్పాటు

అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించే విధంగా చూస్తాం. ఇంతకు ముందు ఏర్పాటు చేసినవి చాలా వరకు పనిచేయటం లేదు. దీంతో ఇబ్బందులు వచ్చాయి. నిర్వహణ బాధ్యత అప్పట్లో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించటంతో సకాలంలో చేయక పాడయ్యాయి, అవసరమున్న వాటికి త్వరితగతిన మరమ్మతులు జరిపించే విధంగా చూస్తాం.

మధుసూదన్‌రెడ్డి, ఎస్సై, చన్‌గోముల్

ఉదాహరణలు కొన్ని..

● అంగడిచిట్టంపల్లిలో గ్రామానికి ఇరువైపులా నాలుగేళ్ల క్రితం నిఘా నేత్రాలు ఏర్పాటు చేయించారు. ప్రారంభంలో బాగానే ఉన్నా కొంత కాలం తరువాత పాడయ్యాయి.

● మీర్జాపూర్‌లో ఇదే పరిస్థితి నెలకొంది చుట్టూ వ్యవసాయ క్షేత్రాలు ఉంటాయి. చాలా కాలంగా నిరుపయోగంగా మారటంతో ఎద్దైనా జరిగితే సకాలంలో ఛేదించేందుకు ఆస్కారం లేకుండా మారింది.

● పూడూరు మండల కేంద్రలో దాదాపు 10 కెమెరాలు ఏర్పాటు చేయించారు. కొన్ని మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. మరమ్మతుల కోసం స్థానిక ప్రజాప్రతినిధులు సకాలంలో చేయించకపోవటంతో అద్దైనా నేరాలు జరిగితే ఇబ్బందులు వచ్చేందుకు ఆస్కారం ఉంది.

భారీ వర్షం.. పల్లెలు జలమయం



పీరంపల్లిలో వర్షానికి రోడ్డుపై కూలిన చెట్టు



పెద్దేముల్‌లో ఇళ్ల మధ్య వరద నీరు

పెద్దేముల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో కూడిన వానతో జనజీవనం స్తంభించింది. సుమారు గంటపాటు వానదంచి కొట్టింది. పెద్దేముల్, నాగులపల్లి, గోపాల్‌పూర్, గాజీపూర్, మారేపల్లి తదితర గ్రామాల్లో ప్రభావం తీవ్రంగా ఉంది.

కుల్కచర్ల గ్రామీణ: గురువారం రాత్రి కుల్కచర్లలో మోస్తారు వర్షం కురిసింది. పీరంపల్లి దగ్గర ప్రధాన రహదారి పక్కనే ఉన్న చెట్టు కూలిపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. రోడ్డుకు పక్కన ఉన్న కొద్దిపాటి స్థలం నుంచి వాహనాలు వెళ్లాయి. కూలిన చెట్టును ఎవరూ తొలగించ లేదు.

నవాబ్‌పేట: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఏదో ఒకచోట భారీగా వానకురుస్తుండడంతో పంట పొలాల్లో నీరు నిలుస్తుంది. చేతికి వచ్చిన అన్ని కూరగాయల పంటలు నీట మునుగుతున్నాయి. యాసంగి సాగుకు దుక్కులు సిద్ధం చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. రైతుల నష్టాల పాలవుతున్నారు.

తాండూరు: నియోజక వర్గంలో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తారుగా వర్షం కురిసింది. ఈ పరిణామం కంది, చెరకు, వరి పంటలకు కాస్త మేలు చేసింది. అయితే కాయలు పగిలి విచ్చుకున్న పత్తి పొలాలకు కాస్త ఇబ్బందేనని రైతులు తెలిపారు.